క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌గా బాలాజీ ప్రసాద్



ఆమదాలవలస: మున్సిపల్ కమిషనర్‌గా పి.బాలాజీప్రసాద్‌ను నియమించినట్లు గురువారం కార్యాలయానికి ఉత్తర్వులు వచ్చా యి. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న జి.రవి గత నెలలో బదిలీపై వెళ్లిపోయారు. ప్రస్తుతం మున్సిపల్ ఏఈ కె.అప్పలనాయుడు ఎఫ్ఏసీ కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. బాలాజీ ప్రసాద్ ప్రస్తుతం నెల్లిమర్ల మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయ న ఆమదాలవలసలో విధుల్లో చేరాల్సి ఉంది.

సొంత నిధులతో రహదారి శుభ్రం



జేసీబీతో రోడ్డును శుభ్రం చేయిస్తున్న రాజశేఖరరెడ్డి

మెళియాపుట్టి: మండలంలోని చాపర-మెళియాపుట్టి గ్రామాలకు మధ్య రహదారిపై ఉన్న మట్టి, ఇరువైపులా పిచ్చి మొక్కలతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతన్నారు. మండల కేంద్రానికి చెందిన పాతపట్నం ఏఎంసీ మాజీ చైర్మన్ అనపాన రాజశేఖర్ రెడ్డి మానవతా దృక్పథంతో ఆలోచించారు. తన సొంత నిధులు వెచ్చించి జేసీబీతో రహదారికి ఇరువైపులా సుమారు కిలో మీటర్ మేర చదును చేయించారు. సొంత నిధులు ఖర్చుచేసి ప్రజలకు ఉపయోగపడే పని చేయడంతో రాజశేఖర రెడ్డిని పలువురు అభినందించారు.

సబ్ జైల్లో వసతులపై ఆరా



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

నరసన్నపేట: స్థానిక సబ్ జైల్లో రిమాండ్ ఖైదీలకు అందుతున్న వసతులపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు సన్యాసినాయుడు ఆరా తీశారు. స్థానిక సబ్‌జైల్‌ను గురువారం తనిఖీ చేశారు. పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలన్నారు. న్యాయవాది రోణంకి కృష్ణంనాయుడు, సబ్ జైల్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

108 కలశాలతో అభిషేకం



అయ్యప్పస్వామికి పూజలు నిర్వహిస్తున్న గురుస్వామి

సారవకోట: మండలంలోని కోదడ్డపనస గ్రామంలో గల స్వయంభూ అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం స్వామి వారికి 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ నాల్గో వార్షికోత్సవం పురస్కరించుకుని స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. గురుస్వామి సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం హోమం, విశేష పూజలు, అన్నసంతర్పణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

56 మందికి నేత్ర పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు తరుణ్

బూర్జ: మండలంలో కేంద్రంలో 56 మంది కంటి రోగులకు తనిఖీలు నిర్వహించినట్లు బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి.రాజశేఖర్ గురవారం తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ విశాఖపట్టణం సౌజన్యంతో శ్రీవెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి సిబ్బంది కంటి రోగులకు తనిఖీలు చేపట్టారు. 8 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. 32 మందికి మందులు అందజేశారు. కంటి వైద్యనిపుణులు తరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న పీడీ చిట్టిరాజు

జలుమూరు: మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని డ్వామా పీడీ చిట్టిరాజు అన్నారు. చల్లవానిపేట–లింగాలవలస జగనన్న కాలనీ వద్ద గురువారం మొక్కలు నాటి ఆయా మొక్కలను లబ్ధిదారులకు దత్తత ఇచ్చారు. మొక్కలను పెంచడం వల్ల ఆరోగ్యంతోపాటు అదనపు ఆదాయం కూడా పొందవచ్చన్నారు. ఏపీఓ శేఖర్, ఈసీ సోమేశ్వరరావు, సిబ్బంది రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కోవిలాం వద్ద నాట్లు వేసేందుకు సిద్ధం చేసిన పొలం



స్కాట్‌పేట పొలానికి నారు తీసుకువెళ్తున్న రైతు

ఖరీఫ్ కష్టాలు

- ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగి వరి పంట
- కాపాడుకునేందుకు అవస్థలు
- నష్టపోయిన రైతును ఆదుకోని ప్రభుత్వం



శ్యామలాపురం వద్ద నాట్లు వేసేందుకు వ్యాన్‌తో తీసుకువచ్చిన వరి నారు

ఈ ఏడాది ఖరీఫ్ వరిసాగు చేస్తున్న రైతులకు కష్టాలు వెంటాడుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటికి వర్షాలు, వాతావరణ పరిస్థితులు అనుకూలించటంతో వరి వెదలు వేసుకున్న రైతులకు తుఫాన్ రూపంలో తీరని నష్టాన్ని మిగిల్చింది. జూలై ఆఖరులో కురిసిన వర్షాలకు ఎల్.ఎన్.పేట మండలంలో వెయ్యి ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగి కుళ్లిపోయాయి. నష్టం జరిగిన రైతులను ఆదుకోవటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు కుళ్లిపోయిన పొలాల్లో వరినాట్లు వేసేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. మండలంలోని దబ్బపాడు, తురకపేట, కోవిలాం, ధనుకువాడ, చిట్టిమండలం, చింతలబడవంజ, రావిచంద్రి, సిద్ధాంతం, బరటాం, శ్యామలాపురం, మిరియాపల్లి, వాడవలస, ముంగెన్నపాడు, సోమనాథపురం, స్కాట్‌పేట, మోదుగువలస తదితర గ్రామాలకు చెందిన రైతులు ఇతర ప్రాంతాల నుంచి వరినారు తెచ్చుకుని నాట్లు వేసే పనులు ముమ్మరంగా చేస్తున్నారు. మరోవైపు పెట్టుబడి సాయం కూడా ఈ ప్రభుత్వం అందించకపోవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ తొలి రోజుల్లోనే పెట్టుబడి సాయం అందించి రైతులను ఆదుకునేదని గుర్తుచేసుకుంటున్నారు. మరోవైపు ఎరువులు కూడా సకాలంలో అందడం లేదని ఆవేదన చెందుతున్నారు.

- ఎల్.ఎన్.పేట



రావిచంద్రి వద్ద వరద నీటిలో కుళ్లిపోయిన వరి చేను



వాడవలస వద్ద నాట్లు వేస్తున్న కూలీలు

వరుదు బాబ్జీ విగ్రహావిష్కరణ

సారవకోట: మండలంలోని అలుదుకు చెందిన పారిశ్రామిక వేత్త వరుదు బాబ్జీరావు (బాబ్జీ) విగ్రహాన్ని ఆ గ్రామంలో గురువారం విశాఖపట్నం ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకరరావు ఆవిష్కరించారు.

బాబ్జీ చేసిన సేవలు, అరసవిల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ పునరుద్ధరణ పనుల గూర్చి ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బగ్గు లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, దేవీ ప్రసాద్, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు తదితరులు పాల్గొన్నారు.



బాబ్జీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, తదితరులు

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణను తొలగిస్తున్న పోలీసులు

ఆమదాలవలస: మండలంలోని గాజులకొల్లివలస సమీపంలో ఉన్న వంశధార రిజర్వాయర్ నిర్వాసితుల ఆర్అండ్ఆర్ కాలనీలోని ఆక్రమణలను రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. వంశధార నిర్వాసితులైన తిరునాగూరు రవి, తిరునాగూరు ప్రమీలకు ప్రభుత్వం గాజులకొల్లివలస బ్లాక్–2లో ఒక్కొక్కరికి ఐదు సెంట్ల స్థలాన్ని మంజూరు చేసింది. ఆ స్థలాన్ని ఆర్ఆర్‌కాలనీలో నివాసం ఉంటున్న బండి విజయ, బండి సింహాచలం ఆక్రమణ చేసి రేకుల షెడ్లు వేశారు. వంశధార నిర్వాసితులమైన తమకు ప్రభుత్వం మంజూరు చేసిన స్థలం వేరే వ్యక్తుల ఆక్రమణలో ఉందని, వారి నుంచి స్థలాలను ఇప్పించాలని బాధితులు జిల్లా కలెక్టర్‌కు 3 నెలల క్రితం ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 60 రోజుల క్రితం ఆక్రమణదారులకు తహసీల్దార్ కార్యాలయం నుంచి నోటీసులు అందించారు. ఇప్పటికీ స్థలాన్ని ఖాళీ చేయకపోడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ రాంబాబు, రెవెన్యూ సిబ్బంది, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఐ వెంకటేష్, పోలీస్ సిబ్బంది గాజులకొల్లివసల చేరుకుని ఆక్రమణదారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో జేసీబీతో ఆక్రమణలను తొలగించారు. సర్వేయర్ బొడ్డేపల్లి గోవిందరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సారవకోట: నౌతళ సబ్‌స్టేషన్ పరిధిలోని ధనుపురం ఫీడర్‌లో శుక్రవారం మరమ్మతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఈఈ శంకరరావు గురువారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ధనుపురం, నౌతళ వ్యవసాయ వినియోగదారులకు, మంచినీటి పథకాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

పొందూరు మండలంలో..

పొందూరు: ఈ నెల 23న మండలంలోని దళ్లవలస ఫీడర్ లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడం, మరమ్మతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు గురువారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దల్లవలస, ధర్మపురం, పిల్లలవలస, పెనుబర్తి, అచ్చిపోలవలస, మొదలవలస, బొడ్డేపల్లి తదితర పంచాయతీల్లోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

ఎల్.ఎన్.పేట మండలంలో..

ఎల్.ఎన్.పేట: మండలంలోని రావిచంద్రి వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టెక్కలి డివిజన్ ఈఈ శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రానికి వెళ్లే లైన్లలో విద్యుత్ వైర్లు సరిచేయటం, చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపడతామన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

నరసన్నపేట: రైతులు ఖరీఫ్‌లో సస్యరక్షణ చర్యలు సక్రమంగా చేపట్టడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని నరసన్నపేట ఏడీ రవీంద్రభారతి అన్నారు. గురువారం ఉర్లాంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమానికి హాజరయ్యారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను, పాటిస్తున్న వ్యవసాయ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వరి పంటలో ఎటువంటి పద్ధతులు పాటిస్తున్నారో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ వరిలో అధికంగా ఎరువులు, పురుగు మందుల వినియోగం మంచిది కాదని సూచించారు. నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఏఓ కె.సునీత తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఏడీ రవీంద్రభారతి

పరామర్శ..

కొత్తూరు: మండలంలోని ఒండ్రుజోల గ్రామానికి చెందిన రెండు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు నిమ్మగడ్డ వరహాలనాయుడు ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పార్టీ నాయకులు శంకు వరహాలింగం భార్య నిర్మల ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో ఆమెను పరామర్శించారు. పరామర్శించిన వారిలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ నాగేంద్ర, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నిమ్మగడ్డ కృష్ణారావు, ధర్మారావు ఉన్నారు.



వరహాలనాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి శాంతి

62 మందికి వైద్య పరీక్షలు



తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యాధికారి పావని, సిబ్బంది

బూర్జ: మండలంలోని అల్లెన గ్రామంలో బూర్జ పీహెచ్‌సీ వైద్యాధికారి ఐ.పావని ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 62 మందికి వైద్య పరీక్షలు చేపట్టి మందులు అందజేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు లఖినాన సరోజిని, టి.తేజారావు, ఏఎన్ఎం ఎస్.మాలతి, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.ప్రవల్లిక, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెల్లివలసలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సాయిగీత

హిరమండలం: మండలంలోని రెల్లివలస ప్రాథమిక పాఠశాల ఆవరణంలో 104 సంచార వైద్యవాహన ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 68 మందికి స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సి.హెచ్.సాయిగీత వైద్య పరీక్షలు చేపట్టి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలోని చిన్నారులు, గర్భిణులకు వైద్యసేవలు అందించారు. సీహెచ్ఓ స్వర్ణకుమారి, వైద్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్‌ను అప్‌లోడ్ చేయాలి

నరసన్నపేట: సచివాలయాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లకు ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని నరసన్నపేట ఎంఈఓ పేడాడ దాలినాయుడు సూచించారు. మండలంలోని వెల్ఫేర్ అసిస్టెంట్లతో గురువారం సమీక్ష నిర్వహించారు. డ్రాపౌట్స్ వివరాలు డైస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సచివాలయ పరిధిలోని డ్రాపైట్స్ వివరాలు వెంటనే సేకరించాలన్నారు. ఆ వివరాలు ఎంఈఓ కార్యాలయానికి అందజేయాలన్నారు. సచివాలయ పరిధిలోని స్కూళ్లలో మరుగుదొడ్ల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్ నాశనం



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్

ఆమదాలవలస: మాదక ద్రవ్యాల జోలికి వెళ్లి యువత భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ కె.వెంకటేష్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై గురువారం అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు బానిసై విలువైన జీవితాన్ని కోల్పోవద్దన్నారు. ర్యాగింగ్, ప్రేమ, మత్తు పదార్థాల వినియోగం, రవాణా తదితర అంశాలు యువత భవిష్యత్తును నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. యువత చట్టపరమైన వివాదాల్లో చిక్కుకోకుండా విద్యపై దృష్టి సారించాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించడం నేరమన్నారు. ఏఎస్ఐ లక్ష్మి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామ సభలు పక్కాగా నిర్వహించాలి



పోలాకి: మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీపీఓ వెంకట్రామన్

పోలాకి: ఉపాధి గ్రామ సభలను క్షేత్రస్థాయిలో పక్కాగా నిర్వహించాలని ఇన్‌చార్జి డీపీఓ వెంకట్రామన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఉషశ్రీ అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతీ పంచాయతీకి లైజనింగ్ అధికారిగా మండల స్థాయి అధికారితో షెడ్యూల్‌ను సిద్ధం చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, వేతనదారులు, రైతులతో కలిసి గ్రామసభ ఏర్పాటు చేసి, అందరికీ అవసరమైన పనుల గుర్తించాలన్నారు. తహసీల్దార్ సురేష్‌కుమార్, ఏపీఓ రమణ తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: పంచాయతీల్లో ఉపాధి గ్రామ సభలు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ మురళీమోహన్‌కుమార్ అన్నారు. గ్రామసభలపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు గుర్తించి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. భవిష్యత్‌లో చేపట్టనున్న ఉపాధి పనులను గుర్తించాలన్నారు. ఉపాధి ఏపీడీ పంచాది రాధ, ఏపీఓ బొత్స పార్వతి, ఈసీ రమాదేవి, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: ఉపాధి గ్రామసభలు విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ పడాల చంద్రకుమారి, ఏపీఓ రవి అన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయం ఆవరణలో పంచాయతీ కార్యదర్శులు, వెలుగు, ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. గ్రామ సభలలో అధిక సంఖ్యలో ప్రజలను భాగస్వామ్యులను చేయాలన్నారు. మండల పరిపాలనా అధికారి తిరుపతి పట్నాయక్, అధికారులు పాల్గొన్నారు.

పాతపట్నం: ఈ నెల 23వ తేదీన మండలంలోని 34 గ్రామ పంచాయతీల్లోనూ గ్రామ సభలను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషన్ ఆఫ్ లేబర్ అజయ్ కార్తికేయ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, సెక్రటరీలతో గ్రామ సభలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, హౌసింగ్ డీఈఈ నర్సింగరావు, ఏఈ సీతారాంరాజు, ఈఓపీఆర్డీ కృష్ణారావు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ గ్రామ సభ నిర్వహించాలని ఎంపీడీఓ ఆర్ కాశీప్రసాద్ సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు గ్రామ సభలు ప్రారంభం కావాలన్నారు. గ్రామాలకు అవసరమయ్యే పనులను గుర్తించి వాటిని తీర్మానించాలన్నారు.

నరసన్నపేట: ఉపాధి గ్రామ సభలు అన్ని పంచాయతీల్లో విధిగా నిర్వహించాలని నరసన్నపేట ప్రత్యేక అధికారి, దివ్యాంగ సంక్షేమ శాఖ ఏడీ కవిత అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. గ్రామ సభల్లో తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. ఎంపీడీఓ మధుసూదనరావు, ఉపాధి మండల ఇంజినీరు అప్పలరాజు పాల్గొన్నారు.

జలుమూరు: గ్రామాలాభివృద్ధికి గ్రామ సభలు ఎంతగానో తోడ్పాడతాయని ఎంపీపీ వాన గోపి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏపీడి బి.మురళీకృష్ణ, మండల ప్రత్యేకాధికారి ఎం.కాలేశ్వరరావు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఏపీఓ శేఖర్, ఈసీ పట్ట సోమేశ్వరరావు పాల్గొన్నారు.

చేతివాటం..!

- బియ్యం బస్తాల్లో భారీగా తరుగు
- గగ్గోలు పెడుతున్న రేషన్ డిపో డీలర్లు



గోదాంలో నిల్వ చేసిన బియ్యం బస్తాలు

సరుబుజ్జిలి: పేదవాడికి అందించే బియ్యంలో కూడా కొంతమంది చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి. ప్రతీ బియ్యం బస్తా నుంచి కిలోల కొద్దీ తరుగు రావడంతో రేషన్ డిపో డీలర్లు గగ్గోలు పెడుతున్నారు. గోదాంలో ఈ వ్యవహారం ఎవరు చక్కబెడుతున్నారో అంతుచిక్కడం లేదని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. మండల కేంద్రానికి సమీపంలో ఎంఎల్ఎస్ పాయింట్ (పౌరసరఫరాల నిత్యావసర వస్తువుల గోదాం) ఉంది. ఈ గోదాం నుంచి మండలానికి చెందిన 41 రేషన్ డిపోలు, ఎల్.ఎన్.పేట- 36, బూర్జ-33, హిరమండలం, జలుమూరు-3, ఆమదాలవలస-1 రేషన్ డిపోకు ప్రతి నెలా రేషన్ సరకులు సరఫరా చేస్తున్నారు. జిల్లా కేంద్రాల నుంచి వచ్చిన బియ్యం బస్తాలు గోదాంలో నిల్వ చేసి ఎటువంటి తూకాలు వేయకుండా రేషన్ డిపోలకు తరలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నిల్వ చేసిన సమయంలో ప్రతీ బస్తా నుంచి కొంతసరకు పక్కదారి పడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రం నుంచి వచ్చే సయంలోనే కొంత తరుగు వస్తుందని, మేం ఏం చేయగలమని గోదాం సిబ్బంది చెబుతున్నారని డీలర్లు వెల్లడించారు. కార్డుదారులకు అందించే సమయంలో సరకుల్లో భారీగా వ్యత్యాసం వస్తుందని, దీనిని ఎలా భరించగలమని డీలర్లు వాపోతున్నారు. అధికారులు స్పందించి సరకుల్లో తరుగు లేకుండా చూడాలని కోరుతున్నారు.

తక్కువగా ఇస్తే సహించేది లేదు..

ఇదే విషయమై మండల పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ బగాది కిశోర్ కుమార్ వద్ద ప్రస్తావించగా.. డీలర్లకు ఇచ్చే సరకులు తప్పకుండా తూకం వేసి అందించాలి. బస్తాల్లో ఎటువంటి తరుగు ఉన్నా సహించేది లేదు. వెంటనే తనిఖీ చేస్తానని తెలిపారు.

న్యాయ సేవలు సక్రమంగా అందాలి



కొనంగిలో ప్రభుత్వ పాఠశాలను సందర్శిస్తున్న జడ్జి సన్యాసినాయుడు

పాతపట్నం: సబ్‌జైల్‌లో ఉన్న ఖైదీలకు న్యాయసేవలు సక్రమంగా అందేలా చూడాలని జిల్లా న్యాయసేవా సమితి కార్యదర్శి, జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. పాతపట్నం సబ్ జైల్‌లో జిల్లా న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా పాన్ ఇండియా క్యాంపెయినింగ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సబ్‌జైల్‌ను పరిశీలించి ఖైదీలతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలు, న్యాయపరమైన సలహాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. మండలంలోని కొనంగి, గిట్టంగి గిరిజన గ్రామాల్లో పర్యాటించి న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. కొనంగి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ రాము, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాదరావు, సీఎస్‌డీటీ భీమారావు, సచివాలయ ఉద్యోగులు, ఆస్పత్రి సిబ్బంది, న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపైనే వాహనాలు



లక్ష్మీనగర్ వీధిలో రోడ్డుపై ఉన్న వాహనాలు, సైకిళ్లు

ఆమదాలవలస: పురపాలక సంఘం పరిధిలోని 12వ వార్డు లక్ష్మీనగర్ వీధిలో రహదారిపైనే సైకిళ్లు, వాహనాలు నిలిపివేయడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిటిజన్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు జె.జె.మోహన్‌రావు, బొడ్డేపల్లి మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ ఎఫ్ఏసీ కమిషనర్ కె.అప్పలనాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఇదే రహదారిలో ఉన్న చెరువు గట్టుపైన చెత్త వేయడం వల్ల దోమలు, ఈగలతో స్థానికులు వ్యాధుల బారీన పడుతున్నారన్నారు.